

గ్యాస్ ధర తగ్గించాలని సిపిఎం ధర్నాలు



నిడమర్రులో..

నిడమర్రు:కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన మండల కేంద్రమైన నిడమర్రు, భువనపల్లిలో ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ నారపల్లి రమణారావు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చే నాటికి సిలిండర్ ధర రూ.365 ఉండగా ఇప్పుడు రూ.1155కు చేరుకుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన ధరను తక్షణం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్, కంచం వరప్రసాద్ పాల్గొన్నారు.

గీత దాటితే ఖబడ్దార్..!


ఎంఎల్‌సి ఎన్నికలపై తమ స్థానిక ప్రజాప్రతినిధులకు వైసిపి అధిష్టానం హెచ్చరికలు

ఓటు తప్పకుండా వేసేలా అధికార పార్టీ వ్యూహాలు

మంత్రి కారుమూరి, మిథున్‌రెడ్డికి జిల్లా బాధ్యతలు

వైసిపికి ముచ్చెమటలు పట్టిస్తున్న ప్రతిపక్షాలు

రసవత్తరంగా ఎంఎల్‌సి సమరం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


స్థానిక సంస్థల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. స్వతంత్ర అభ్యర్థులు అధికారపార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులకు ప్రతిపక్ష టిడిపి, జనసేన మద్దతు లభించడంతో ఎన్నికల పోరు హాట్‌టాపిక్‌గా మారింది. జిల్లాలో స్థానిక సంస్థలకు చెందిన రెండు ఎంఎల్‌సి స్థానాలకు ఈ నెల 13న ఎన్నికలు జరగనున్నాయి. జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మొత్తం 1,105 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. దాదాపు 870 మంది వైసిపి స్థానిక ప్రజాప్రతినిధులే ఓటర్లుగా ఉన్నారు. దీంతో రెండు ఎంఎల్‌సి స్థానాలు వైసిపికి ఏకగ్రీవంగా దక్కాల్సి ఉండగా స్వతంత్ర అభ్యర్థులు నలుగురు బరిలో నిలవడంతో ఎన్నికలు తప్పలేదు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన వీరవాసరానికి చెందిన వీరవల్లి చంద్రశేఖర్‌కు టిడిపి మద్దతివ్వడంతోపాటు సర్పంచుల ఛాంబర్ సైతం మద్దతు పలికింది. ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు ఓటు వేయొద్దని జనసేన అధినాయకత్వం సైతం పిలుపునిచ్చింది. దీంతో టిడిపి, జనసేన ప్రజాప్రతినిధులు స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు ఓటు వేయనున్నట్లు స్పష్టమైంది. టిడిపి, జనసేనకు 217 మంది స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. మరో 250 మంది ప్రజాప్రతినిధులు ప్రతిపక్షాలు బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తే ఫలితం తారుమారయ్యే పరిస్థితుంది. ప్రభుత్వంపై స్థానిక ప్రజాప్రతినిధుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో ఓట్లు చీలే అవకాశం ఉందని వైసిపి నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. ఓట్లు చీలకుండా వైసిపి ప్రజాప్రతినిధులంతా పక్కాగా వైసిపి అభ్యర్థులకే ఓటు వేసేలా వైసిపి నాయకత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డికి ఎంఎల్‌సి ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించే బాధ్యత వైసిపి అధిష్టానం అప్పగించింది. వైసిపి తరపున కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా వీరవల్లి చంద్రశేఖర్‌తోపాటు గోరింక దాసు, పసల వెంకటాచలం, దేవరపల్లి ఆదాం ఉన్నారు. వీరిలో వీరవల్లి చంద్రశేఖర్ ప్రధాన పోటీదారుగా ఉన్నారు. దీంతో వైసిపి నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమావేశాలు నిర్వహించి ఎంఎల్‌సి ఎన్నికల గురించి వివరిస్తున్నారు. ఓటు ఎలా వేయాలి, ఏ విధంగా వేస్తే గెలుపుంటుందో చెబుతున్నారు. డబ్బు పంపిణీ చేయనున్నట్లు మొదట్లో పెద్దఎత్తున ప్రచారం సాగింది. అదే జరిగితే గెలుపోటములు తారుమారయ్యే పరిస్థితి ఏర్పడనుందని వైసిపి నాయకులు అంచనా వేస్తున్నారు. తమ స్థానిక ప్రజాప్రతినిధులతో వైసిపి అగ్రనాయకులు ఒకే అంశాన్ని వివరిస్తున్నారు. ప్రతిఒక్కరూ వైసిపి అభ్యర్థులకే ఓటు వేయాలని లేకపోతే... అంటూ హెచ్చరించినట్లు తెలుస్తోంది.

ఓట్లు చీలిస్తే గెలిచినట్లుగా ప్రతిపక్షాలు ప్రణాళికలు

ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచేంత బలం లేకపోయినా ప్రతిపక్ష పార్టీలు గట్టి ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. తాము బలపరిచిన అభ్యర్థి గెలిచినా, గెలవకపోయినా వైసిపి ఓట్లు చీలిస్తే విజయం సాధించినట్లేనన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొదటి ఓటు వైసిపి అభ్యర్థికి వేసి, రెండో ఓటు ప్రతిపక్షాలు బలపరిచిన అభ్యర్థికి వేసినా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నట్లుగా స్పష్టమవుతుందని ప్రచారం చేస్తున్నారు. ఇది అధికార పార్టీకి ఇబ్బందికర పరిణామంగా చెబుతున్నారు. ప్రస్తుతం మౌనంగా ఉన్నా ఓటు వేసేటప్పుడు కచ్చితంగా కొంతమంది అధికారపార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు తాము బలపరిచిన అభ్యర్థికి ఓటువేసే అవకాశం ఉందని ప్రతిపక్షాలు అంచనా వేస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఏం తీర్పు చెబుతారో ఈ నెల 16న ఓట్ల లెక్కింపు వరకూ వేచిచూడాల్సిందే.

నారీ.. ప్రభాత భేరి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



నేడు నారీమణులు ప్రభాత భేరి మోగిస్తున్నారు.. అన్ని రంగాల్లో అగ్రపథాన నిలుస్తున్నారు.. అమ్మగా.. ఇల్లాలిగా.. అక్కగా ఇలా ఎన్నో పాత్రలు పోషిస్తూ ఇంటిని చక్కదిద్దుతున్నారు.. ఓర్పులో.. నేర్పులో.. ఓదార్పులో ఆమె సాటి.. ఒకపక్క ఇంటి పనులు చేస్తూ.. మరో పక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు.. విద్య, వృత్తి, ఉద్యోగాల్లో పురుషులకు ఏమాత్రం తీసిపోమంటూ నిరూపిస్తున్నారు.. అన్నిరంగాల్లో రాణిస్తున్నా మహిళలపై దాడులకు అడ్డుకట్ట పడటం లేదు. ఎన్ని చట్టాలొచ్చినా ఆమె కంట కన్నీటి చెమ్మ ఆరడం లేదు. ప్రభుత్వం చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన ఉందని పలువురు చెబుతున్నారు.. మహిళా దినోత్సవం సందర్భంగా పలువురి మనోగతం..

బహుముఖ ప్రజ్ఞాశాలి మహిళ
పి.ప్రశాంతి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్



స్త్రీని గౌరవించినప్పుడే నవ సమాజం రూపందాలుస్తుంది. తల్లిగా, చెల్లిగా, భార్యగా, ఉద్యోగిగా బహుముఖ ప్రజ్ఞాశాలి మహిళ. తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే కుటుంబం కోసం పరితపిస్తుంది. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సత్కరించుకోవడం మన బాధ్యత. నూతన జిల్లాలో తొలిసారిగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నాం. ఈ ఏడాది మహిళా దినోత్సవం థీమ్ 'ఎంబ్రేస్ ఈక్విటీ' కార్యక్రమం చేపట్టనున్నాం. దీని అర్థం లింగ సమానత్వం. ఈ థీమ్‌పై కార్యక్రమం నిర్వహిస్తాం. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలి.

ఓర్పుకు, నేర్పుకు, ఓదార్పునకు చిరునామా.. మహిళ
షేక్ నూర్జహాన్ పెదబాబు, నగర మేయర్, ఏలూరు



సృష్టికి ప్రతి సృష్టినిచ్చి సమాజానికి మార్గ నిర్దేశం చేసే ఏకైక వ్యక్తిత్వం మహిళ సొంతం. సంసార సాగరంలో ఓర్పుకు, నేర్పుకు, ఓదార్పునకు మహిళ చిరునామా. అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా ఆత్మీయతతో అనురాగాన్ని పంచే అమతమూర్తి మహిళ. మారుతున్న మరమనుషుల కాలంలో... మానవత్వం మంటగలుస్తున్న రోజుల్లో.. దినదిన గండాల దాష్టీకాల నడుమ.. ఓపిగ్గా నిలిచే శక్తి మా మహిళలకు ఉంది. ఏలూరు కార్పొరేషన్‌కు రెండుసార్లు మేయర్‌గా పనిచేసే అదృష్టం దక్కడం సంతోషదాయకం. మా స్వస్థలం ఒంగోలు. పదో తరగతి వరకు చదివిన నేను పాలనకు తొలుత భయపడినా.. నగర ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు దూసుకుపోతున్నాను. మహిళలు పురుషులతో దేనిలోనూ తీసిపోరు. కష్టపడితే ఏదైనా సాధ్యమే. మహిళలు మరింతగా కష్టపడి సమాజానికి మేలు చేయాలనేది నా ఆకాంక్ష.

నా తల్లిదండ్రులు ప్రోత్సహించారు..
డాక్టర్ డి.ఆశా, డిఎంహెచ్‌ఒ, ఏలూరు



స్త్రీ మన సంస్కృతికి, ధర్మానికి మూలవిరాట్టు. అలాంటి స్త్రీగా జన్మించడం నేనెంతో సంతోషంగా భావిస్తున్నాను. నా తల్లిదండ్రులు నన్ను కొడుకులానే పెంచారు. మంచి ధైర్యం నూరిపోశారు. ప్రస్తుతం డిఎంహెచ్‌ఒగా పని చేస్తున్నానంటే స్త్రీగా పుట్టడమే కారణమని నేను భావిస్తున్నాను. మంచి అడ్మినిస్ట్రేటర్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది. తప్పకుండా స్త్రీ శక్తి సామర్థ్యాలు సమాజం గుర్తిస్తుంది.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి
జి.రోసిలిన్, మైక్రో బయాలజీ లెక్చరర్, సిఎస్ఎన్ కళాశాల భీమవరం



పాలకులు మారుతున్నా మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ లేకుండాపోయింది. నేటికీ మహిళలంటే వివక్షకు ప్రతిరూపాలుగా ఉంటున్నారు. చిత్రహింసలకు గురి చేయడంతోపాటు దాడులకు పాల్పడుతున్నారు. ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాలి.

మరిన్ని చట్టాలు రూపొందించాలి
డాక్టర్ స్వర్ణ నిరంజని, పిహెచ్‌సి వైద్యురాలు, పాలకోడేరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో మహిళా రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయి. దిశ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, దిశా యాప్, దిశ చట్టం వంటివి అమలు చేస్తుండటం అభినందనీయం. అయితే నేటికీ మహిళలపై దాడులు, అత్యాచారాలు జరగడం ఎంతో బాధిస్తుంది. మహిళా రక్షణకు మరిన్ని చట్టాలు రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి
జి.స్వాతి, ఎంపిడిఒ, కాళ్ల



మహిళలకు చదువే ఆస్తి. ఉద్యోగం తప్పనిసరి. స్వశక్తిగా ఎదగాలి. నా స్వస్థలం విశాఖపట్నం. నా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి విద్యాబుద్ధులు నేర్పించారు. కుటుంబంలో మహిళ ప్రభుత్వ ఉద్యోగంలో రాణిస్తే విద్యాబుద్ధులు, క్రమశిక్షణ, పొదుపు, ధైర్యం ఇలా అన్నీ ఆ కుటుంబానికి అలవడుతాయి. 2011లో విశాఖపట్నంలో బిఇడి చేశాక 2012 గ్రూప్-1 పరీక్ష రాసినా ఫలితం రావడం ఆలస్యమైంది. 2017లో గ్రూప్-1కు ఎంపికయ్యాను. 2018లో వీరవాసరం ఎంపిడిఒగా పని చేశాను. ప్రస్తుతం కాళ్ల ఎంపిడిఒగా పని చేస్తున్నాను.

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

ఎంఎల్‌సి ఎన్నికల శిక్షణలో పరిశీలకులు ఎస్.సురేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ఎంతో కీలకమని ఎన్నికల పరిశీలకులు, విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో సూక్ష్మ పరిశీలకుల విధులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్లు, సంబంధిత అధికారులతో సురేష్‌కుమార్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలును నిశితంగా పరిశీలించాలన్నారు. ఉల్లంఘన జరిగితే నివేదిక ఇవ్వాలన్నారు. సూక్ష్మ పరిశీలకులు తమ నివేదికలను నేరుగా ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. పోలింగ్ బూత్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పని చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారితో సమన్వయం చేసుకుని పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఏదైనా సమస్య, సంఘటన గురించి చెప్పాలనుకుంటే నేరుగా తమకుగాని, జిల్లా ఎన్నికల అధికారికిగాని తెలియజేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి డైరీలో ఎన్నికల సంఘటన అంశాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారో, లేదో గమనించాలన్నారు. ఫొటో ఓటర్ల జాబితా నకలు ఒకటి తమ దగ్గర అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సుకు వేసిన సీళ్లు పరిశీలించాలన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మైక్రో అబ్జర్వర్లు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, వెబ్ కాస్టింగ్‌కు సంబంధించి రహస్య ఓటింగ్‌కు భంగం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ఆయా అంశాలకు సంబంధించి ఏయే ఫార్మేట్లలో నివేదికలు ఇవ్వాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఏలూరు జిల్లా డిఆర్‌ఒ ఎవిఎస్ఎస్.మూర్తి, ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు ఆర్‌డిఒలు కె.పెంచల కిషోర్, డి.రాజు, డాక్టర్ ఝాన్సీరాణి, మల్లిబాబు, జెడ్‌పి సిఇఒ కె.రవి కుమార్, ఎక్సైజ్ సూపరిం టెండెంట్ ఎన్.బాలకృష్ణన్, ఏలూరు మున్సిపల్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయ రాజు, డ్వామా పీడీ డి.రాంబాబు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై మూడు జిల్లాల ఎస్‌పిలతో ఎన్నికల పరిశీలకులు ఎస్.సురేష్ కుమార్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఏలూరు జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్ఇబి అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు పాల్గొన్నారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా నిరోధించేందుకు ప్రత్యేక నిఘా ఉంచడంతోపాటు చెక్ పోస్టులను పటిష్టం చేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని ఎన్నికల పరిశీలకులు ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. జిల్లా అధికారులు ఎన్నికల ఏర్పాట్లను ఆయనకు వివరించారు.

ప్రతిభకు ప్రేరణ ప్రారంభం

సాంఘిక సంక్షేమ శాఖ జెడి ఎస్.మధుసూదనరావు

ప్రజాశక్తి - ఏలూరు

విద్యార్థుల భవిష్యత్ పదో తరగతి ఉత్తీర్ణతపై ఆధారపడి ఉందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.మధుసూదనరావు తెలిపారు. మంగళవారం స్థానిక సాంఘిక సంక్షేమశాఖ కార్యాలయంలో ప్రతిభకు ప్రేరణ అనే కార్యక్రమాన్ని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జెడి మధుసూదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఏలూరు పరిధిలోని కొవ్వలి, కూచింపూడి, ఏలూరు బాలురు, బాలికల వసతిగృహాల్లోని పదో తరగతి విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడానికి ప్రతిభకు ప్రేరణ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు పదో తరగతి ఉత్తీర్ణతా శాతంపై ఆధారపడి ఉందన్నారు. అన్ని సబ్జెక్టుల్లో పరీక్షకు సంబంధించిన అవగాహన కల్పించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసి పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిభకు ప్రేరణ కార్యక్రమం ఏర్పాటుపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ శాఖాధికారులు కె.త్రిమూర్తులు, పి.సురేష్‌బాబు, బి.రామారావు, ఎస్.గోల్డెన్, కె.సత్యనారాయణ, జి.రాధ, బి.రమేష్, బోధనా నిష్ణాతులు ఎ.మురళీకృష్ణ, వి.విజయలక్ష్మి, జి.దుర్గారావు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

ఆగిరిపల్లి:జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం నాడు ఆయన ఆగిరిపల్లిలోని రద్దు చేసిన జగనన్న లేఅవుట్ల స్థానంలో కొత్తగా మంజూరు చేసిన లేఅవుట్లను పరిశీలించారు. ఆనంతరం మండల పరిధిలోని ఈదులగూడెంలో ఆక్రమణకు గురైన ఆర్అండ్‌బి మెయిన్‌రోడ్డును పరిశీలించి ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమణ, విఆర్‌ఒ అజయ్‌కళ్యాణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎస్‌పి లతాకుమారి

'పోలవరం'ప్రాజెక్టు పరిసరాల్లో వేటకు వెళ్లొద్దు

పోలవరం:పోలవరం ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి అన్నారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లోని మత్స్యకారులతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలోఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు స్పిల్‌వే ప్రాంతంలో నీరు ఎక్కువగా ఉండి ప్రమాద భరితంగా ఉంటుందన్నారు. గతేడాది డిసెంబర్‌లో అక్కడ వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులు మృతిచెందారన్నారు. ఆ ప్రాంతంలో వేట నిషేధించారన్నారు. మత్స్యకారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. ప్రాజెక్ట్ స్పిల్ వే ప్రాంతానికి దిగువన ఉన్న టూరిజం బోట్ పాయింట్ పరిధిలో మాత్రమే వేటకు అనుమతి ఉందన్నారు. దీనిపై పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా గోదావరి పరిధి తగ్గిందన్నారు. 75 పడవల్లో మత్స్యకారులు వేటకు వెళ్తున్నారని అయితే నీరు తగ్గడం చేపలు దొరక్కపోవడం వంటి కారణాలవల్ల ఉపాధిని కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక ఇతర ప్రాంతాల నుండి మత్స్యకారులు అధిక సంఖ్యలో వచ్చి పెద్దపెద్ద వలలతో చిన్నచిన్న చేపలను సైతం పట్టుకొని వాటిని కోళ్ల మేతకు ఎగుమతి చేస్తున్నారన్నారు. దీంతో స్థానికంగా ఉండే మత్స్యకారులు నష్టపోతున్నామని డిఎస్‌పికి వివరించారు. దీనిపై స్పందించిన ఆమె మత్స్యకారుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్పిల్ వే దిగువన ఒక కిలోమీటర్ పరిధిలో వేటకు అనుమతి వచ్చేలా చూస్తానన్నారు. అప్పటివరకు మత్స్యకారులు ఆ ప్రాంతానికి వేటకు వెళ్లొద్దని వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ విజయబాబు, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ప్రాజెక్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ అధికారులు పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల అణచివేతను కలిసికట్టుగా తిప్పికొట్టాలి

రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్త్రీలకు పురుషులతో సమాన అవకాశాలు, స్త్రీల పట్ల అణచివేత, హింస లేని స్థితి కోసం అంతా కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతో ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సిఆర్ రెడ్డి ఫార్మసీ కాలేజీ, ఆదిత్య డిగ్రీ కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన సభల్లో ఆమె ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఫార్మసీ కాలేజీలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రవీంద్రబాబు, ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎంఎన్.శ్రీకాంత్ అధ్యక్షత వహించారు. ఆయా కళాశాలల్లో రమాదేవి మాట్లాడుతూ 1908లో మొదలైన మహిళా వివక్ష వ్యతిరేక ఉద్యమాల ఫలితంగా 1917లో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించారన్నారు. 1975 నుండి ఐక్యరాజ్య సమితి అన్ని దేశాల్లో జరపాలని ప్రకటించిందన్నారు.

ఫార్మసీ కాలేజీలో మహిళా లెక్చరర్లను అభినందిస్తూ ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం తరపున సంఘ సంస్కర్త రాజారామ్మోహన్‌రాయ్ జీవిత చరిత్ర పుస్తకాలు, మహనీయుల జయంతులు, వర్ధంతులు తెలిపే విధంగా ముద్రించిన 2023 క్యాలెండర్‌ను రమాదేవి చేతుల మీదుగా అందజేశారు.

ఆయా సభల్లో రిటైర్డ్ హెడ్ మాస్టర్ పి.కస్తూరిబాయి, ఐద్వా నాయకులు పి.హైమావతి, జి.శారద, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సభ్యులు కూన కృష్ణారావు, శ్రామిక మహిళా నాయకులు వెంకటరమణ, ఎ.ఉషారాణి పాల్గొన్నారు.

స్త్రీలపై దాడులు, వేధింపులు ఆపాలి

శ్రామిక మహిళా సదస్సు

మహిళలకు సమాన హక్కులు కల్పించాలని, మహిళలపై వేధింపులు, దాడులు అరికట్టాలని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని శ్రామిక మహిళ సదస్సు డిమాండ్ చేసింది. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఆర్ పేట సిఐటియు జిల్లా కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అధ్యక్షత వహించారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి, మెప్మా ఆర్పీల జిల్లా కార్యదర్శి పి.వెంకటరమణ, ఆర్‌టిసి మహిళా ఉద్యోగుల సంఘం నాయకురాలు అరుణకుమారి, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకురాలు జె.స్వాతి, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం నాయకురాలు జి.శారద, ఆశా వర్కర్ల నాయకురాలు శివశంకరి మాట్లాడారు. నేటికీ మహిళలకు సమాన అవకాశాల్లేక అసమానతలు ఎదుర్కొంటున్నారని, రంగాల్లో వివక్ష, వేధింపులు పెరుగుతున్నాయని, చట్టసభల్లో మహిళలకు కనీసం 33శాతం రిజర్వేషన్ల కోసం అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ చట్టాలు రూపొందించడం లేదన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ మతోన్మాద విధానాల వల్ల మహిళలపై మూఢనమ్మకాలు, ఆశాస్త్రీయ ఆలోచనలు పెరుగుతున్నాయన్నారు. సదస్సులో వివిధ సంఘాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, ఆశాలు, స్కూల్ స్వీపర్లు, మెప్మా ఆర్‌పిలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం సిఐటియు జిల్లా కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న రమాదేవి



కొవ్వొత్తుల ర్యాలీలో మహిళలు

5న చలో ఢిల్లీ విజయవంతం చేయాలి


ప్రజాశక్తి - పెదపాడు

కార్మిక, రైతాంగ సమస్యలపై వచ్చేనెల ఐదో తేదీన నిర్వహిస్తున్న చలో ఢిల్లీని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య పిలుపునిచ్చారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి కార్మిక, కర్షక ఐక్యతా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి గుండపనేని సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన బి. సోమయ్య మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలను విడదీసి పాలిస్తుందని, అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికుల పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, ఇతర స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ఏడాదికి 200 రోజుల పనులు, రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. ఈ సదస్సులో ఆయా సంఘాల నాయకులు పి.దుర్గ, లింగం కృష్ణారావు, రెడ్డి లక్ష్మణరావు, ముసునూరి కొండలరావు, పిట్టా రహేయేలు, థామస్ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకులు.. ఆటో సరస్వతి



జంగారెడ్డిగూడెం : కుటుంబం బాధ్యతలో మేము సైతం అంటూ చాటిచెప్పే మహిళలకు స్థానిక ఆటో సరస్వతి స్ఫూర్తినిస్తుంది. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్న భర్తకు తానుకూడ చేదోడుగా సహకారం అందించడంలో అమె ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేసింది. జంగారెడ్డిగూడెంలో మొట్టమొదటి మహిళా ఆటో డ్రైవర్ దాసరి సరస్వతిని పలువురు అభినందిస్తున్నారు. ఇంటర్ పాసైనప్పటికీ ఆటో నడుపుతూ రవాణా రంగంలో ఆటో సరస్వతిగా ప్రత్యేకతను చాటుకుంది ఆమె. స్కూల్ పిల్లలను బడికి తీసుకెళ్తూ మహిళలకు ప్రాధాన్యతిస్తూ ఆటో నడుపుతున్న సరస్వతి పట్టణంలో పలువురికి సుపరిచితురాలైంది. మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెకు పలువురు మహిళా దినోత్సవ శుభాకంక్షలు తెలిపారు.



సాయం చేస్తున్న పర్వతనేని గంగాధర్

హోలీని పురస్కరించుకుని పేదలకు సాయం

ప్రజాశక్తి - చాట్రాయి

హోలీ పండుగను పురస్కరించుకుని నూజివీడు నియోజకవర్గ టిడిపి నేత పర్వతనేని గంగాధర్ పేదలకు ఆర్థికసాయం చేశారు. మండలంలోని పోతనపల్లి గ్రామానికి చెందిన మహిళలు, పురుషులు 400 మందికి రూ.లక్షా పదివేలు అందించారు. ఆపదలో ఉన్నవారికి ఆయన అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఈ సాయం అందించారు.

వైభవంగా రెడ్డి గణపవరం దుర్గమ్మ తీర్థం ప్రారంభం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీలోనే అతిపెద్దదైన రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ తీర్థం మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. ఐదు రోజులపాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ప్రతిఏటా ఫాల్గుణ మాసం(హోలీ) పౌర్ణమి నుండి ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్దఎత్తున పాల్గొంటారు. ఈ ఆలయంలో గిరిజనులే పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో గణపతి ఆలయం, అన్నపూర్ణ, విశ్వేశ్వర ఆలయాలు, నవగ్రహ మండపం విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్నపూర్ణ, విశ్వేశ్వర స్వాములు వేర్వేరు ఆలయాల్లో కొలువై ఉండటం ఇక్కడ విశేషం. నుండి రెండు మూడు లక్షల మంది యాత్రికులు ఐదు రోజులపాటు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకుంటారు. గోదావరి జిల్లాల నుండే కాకుండా కృష్ణ, గుంటూరు, తెలంగాణ రాష్ట్రం నుండి కూడా ప్రజలు పెద్దఎత్తున తరలివస్తారు. సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న ఈ ప్రాంతవాసులు ఈ ఉత్సవాలకు సొంతూళ్లకు వస్తుంటారు. యాత్రికుల సౌకర్యార్థం జంగారెడ్డిగూడెం నుండి రెడ్డిగణపవరానికి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ అల్లూరి రత్నాజీరావు మాట్లాడుతూ దుర్గమ్మ తీర్థ మహోత్సవాల్లో పాల్గొనే యాత్రికుల సౌకర్యార్థం తాగునీరు, దర్శన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్య సిబ్బందిచే వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా స్థానిక పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు.

కోతల్లేకుండా విద్యుత్ సరఫరా

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలుతో పాటు పోలసానిపల్లి, పరిసర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామని ట్రాన్స్ కో భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ తెలిపారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు అంతరాయం లేని విద్యుత్ సరఫరా, లో ఓల్టేజి సమస్యలను అధిగమించడం,, అత్యవసర మరమ్మతులు వచ్చిన సమయంలో అన్ని ప్రాంతాలకు కాక కొన్ని ప్రాంతాలకు మాత్రమే, మరమ్మతులు జరిగేంతవరకూ విద్యుత్ సరఫరా నిలిపేందుకు ఎయిర్ బ్రేక్ స్విచ్ (ఎబి స్విచ్‌లను) అమర్చే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ మేరకు గత రెండు రోజులుగా చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా శిథిలమైన స్తంభాల స్థానంలో నూతన స్తంభాల ఏర్పాటు, అవసరం మేరకు అదనపు స్తంభాల ఏర్పాటు, కాలం చెల్లిన, సాగిపోయిన విద్యుత్ కండక్టర్ల మార్పిడి కార్యక్రమం చేపట్టామన్నారు. మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమం పూర్తయిందన్నారు. ఈ మేరకు 12 అదనపు విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఐదు కిలోమీటర్ల మేర విద్యుత్ కండక్టర్ల మార్పిడి చేయటంతో పాటు అవసరం మేరకు 15 ఎబి స్విచ్ లను అమర్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో భీమడోలు ఎఇ రామసాయి పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటంలేదని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మాలతీరాణి విమర్శించారు. ఈ మేరకు ఉంగుటూరు తహశీల్దార్ ఎవి.రమణారావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 13న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైసిపి పార్టీ నాయకుల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని ఎన్నికల కోడ్ స్పష్టం చేస్తోందన్నారు. రేషన్ బియ్యం పంపిణీ చేసే వాహనాలపై సిఎం ఫొటోతో ఊరూరా తిప్పుతూ ఎన్నికల కోడ్ ను ఉల్లంఘిస్తున్నారని, వెంటనే పోస్టర్లను తొలగించాలని ఫిర్యాదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల కార్యదర్శి నూకల రోహిత్, కార్యవర్గ సభ్యుడు మణికంఠ పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలల మరింత అభివృద్ధి

ప్రజాశక్తి - గణపవరం

దాతల సహకారంతో పాఠశాలలను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఎంఇఒ పి.శేషు అన్నారు. మంగళవారం కాశిపాడు-2 పాఠశాలకు విద్యా కమిటీ ఛైర్మన్ కాళిదాసు మేరీ కుమారి కంచాలు, దాతలు సహకారంతో ప్రింటర్‌పే అందజేశారు. సందర్భంగా శేషు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు దాతలు కూడా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టివిఎస్.రంగనాయకులు, ఉపాధ్యాయులు చల్లా కృష్ణ, జి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గణపవరంలో జన ఔషధి దివాస్ ఉత్సవం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తొమ్మిది సచివాలయాల్లో మంగళవారం జన ఔషధీ దివాస్ ఆయుష్మాన్ భారత హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో జన ఔషధీ దివాస్ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్ధవరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆరోగ్య కేంద్రం వైద్యులు పి.సంతోష్‌నాయుడు హై పవర్ కనెక్షన్ డయాబెటిస్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రతినెల రెండుసార్లు గ్రామానికి వచ్చి మందులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ జెవిల్సన్‌బాబు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీతిరుపతమ్మ కళ్యాణం

ప్రజాశక్తి - ముసునూరు

లోపూడి శివారు బసవరప్పాడులోని శ్రీలక్ష్మి తురుపతమ్మ కళ్యాణోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. పూజారి తలకొండ వీరయ్య ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. ఆనంతరం అన్నదానం చేశారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి విక్రయ ముఠా గుట్టు రట్టు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గంజాయి విక్రయ ముఠా గుట్టును ఆగిరిపల్లి పోలీసులు మంగళవారం రట్టు చేశారు. నూజివీడు డిఎస్‌పి ఈడే అశోక్ కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలుకు చెందిన వెలిచర్ల నాగరాజు(50) గంజాయికి అలవాటు పడి గంజాయి కూడా అమ్మేవాడు. మండల పరిధిలోని వడ్లమాను కొండకాలనీ వద్ద ఇల్లు అద్దెకు తీసుకుని ఆగిరిపల్లి, నున్న, విజయవాడ పరిసర ప్రాంతాలకు గంజాయి సరఫరా చేసేవాడు. విశాఖ జిల్లా పాడేరుకు చెందిన పాంగి ప్రసాద్(36), పాంగి సోంబాబు(44)తో పరిచయాలు పెంచుకుని అక్కడ నుంచి గంజాయి తీసుకొచ్చి, చిన్న,చిన్న ప్యాకేట్లుగా తయారు చేసి విక్రయించేవాడు. ఈ మేరకు సమాచారం అందడంతో అతని ఇంటి వద్ద తనిఖీ చేశారు. వారి వద్ద గంజాయి పట్టుబడింది. ఈ క్రమంలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని ఆరు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

10 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అక్రమంగా బియ్యం తరలిస్తున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేశామని స్థానిక సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహశీల్దార్ సుధాకర్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి పట్టణ శివారు రామచర్ల గూడెం చెక్ పోస్ట్ వద్ద రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న లారీని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. చింతలపూడి మండలం రాఘవాపురం నుండి కాకినాడ పోర్టుకు గుబ్బల శ్రీనివాసరావు అనే వ్యక్తి రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీ, బియ్యం విలువ రూ.8,91,160 ఉంటుందని తెలిపారు.

అన్నిరంగాల్లోనూ రాణిస్తున్న మహిళలు

ప్రజాశక్తి - ఏలూరు

మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్నారని జిల్లా సమాచార పౌర సంబంధాధికారి ఎస్.భవాని అన్నారు. స్థానిక జిల్లా సమాచార పౌర సంబంధాధికారి కార్యాలయంలో మంగళవారం మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ సమాజంలో మహిళలు, పురుషులు సమానమేనన్నారు. పురుషులకన్నా మిన్నగా తమ ప్రతిభతో అవకాశాలు సాధించుకుంటున్నారని, అంతరిక్షం వరకూ ఆకాశమే హద్దుగా మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారని, మహిళాభివృద్ధిలో ఇది శుభపరిణామమన్నారు. కుటుంబ వ్యవస్థలో లింగ వివక్ష రూపుమాపడం తల్లిదండ్రుల నుండే ప్రారంభం కావాలన్నారు. వివక్షలేని సమాజం దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతీ మహిళ తప్పనిసరిగా విద్యావంతురాలు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాధికారి ఆర్‌విఎస్.రామచంద్రరావు, డివిజినల్ పిఆర్‌ఒ సిహెచ్.దుర్గా ప్రసాద్, ఎవిఎస్ సిహెచ్.రాంబాబు, డి.సౌరి ప్రసాద్, టి.బాబూరావు, సంధ్యాకమల, ఎం.మల్లేశ్వరి, పి.శారద, రత్నం, రేష్మ మరియా, రామారావు పాల్గొన్నారు.



ఏలూరులోని డిపిఆర్‌ఒ కార్యాలయంలో..

భీమడోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎస్ఐ చావా సురేష్ అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రధాన అధ్యాపకులు వంగా నాగేశ్వరరావు, బొమ్ము రవికుమార్ సంయుక్త పర్యవేక్షణలో కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధాన అధ్యాపకులు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా విద్యను ప్రోత్సహించే క్రమంలో పలు సంస్కరణ అమలు చేస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని మహిళలు తమకు ఆసక్తిగల రంగాల్లో గుర్తింపు పొందాలని కోరారు. ఈ మేరకు కళాశాల తరఫున సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం కళాశాల విద్యార్థినులకు ఈవ్ టీజింగ్, ఇతర ఇబ్బందుల నుంచి రక్షణ కల్పించేందుకు ప్రత్యేకంగా నియమితులై విజయవంతంగా సేవలందించిన భీమడోలు పోలీస్



భీమడోలులో...

స్టేషన్‌కు చెందిన మహిళా కానిస్టేబుళ్లు రత్న మౌనిక, జ్యోతి, దివ్య దీప్తి, దేవి, కళాశాలకు చెందిన అధ్యాపకులు మాధవి, గౌరీ, విజయ దుర్గ, పద్మజను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉప ప్రధాన అధ్యాపకులు డిఎంబిబి.సింగ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ధనరాజు, నాగరాజు పాల్గొన్నారు

ఏలూరు: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాశాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని స్థానిక జిల్లా ఖజానా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఖజానా శాఖ అధికారి టి.కృష్ణ హాజరై మహిళా ఉద్యోగులకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేడు మహిళలందరూ అనేక రంగాల్లో అగ్రస్థానంలో ఉన్నారని, ఆ స్థానం నిలబెట్టుకోవాలంటే ఇంకా కష్టపడి పని చేయాలన్నారు. ఎప్పటికప్పుడు నూతన సాంకేతికను తెలుసుకోవాలని సూచించారు. సహాయ ఖజానాధికారి పి.ప్రేమావతి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం దిశాయాప్‌ను ప్రవేశపెట్టారని, యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నూతన సాంకేతికతను నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కప్పల సత్య నారాయణ, ట్రెజరర్ నెరుసు గణేశ్వరరావు, సీనియర్ ఉపఖజానాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చింతలపూడి : సమాజంలో పురుషులతో పాటు స్త్రీలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మహిళా సాధికారిత సంస్థ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఒ మణి కుమారి, వైద్యాధికారి డాక్టర్ అభిద పాల్గొన్నారు. మహిళా దినోత్సవంపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

గణపవరం: సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జిల్లా మాజీ న్యాయమూర్తి అడబాల లక్ష్మి అన్నారు. మంగళవారం మహిళా దినోత్సవ సందర్భంగా గణపవరం డిగ్రీ కాలేజీలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశానికి కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మల కుమారి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ భాగం రాష్ట్ర నాణ్యత సమన్వయకర్త కె.విజయ్ కుమారి మాట్లాడారు.

ఏలూరు టౌన్: స్త్రీ విద్య-స్త్రీ సంపాదన ప్రారంభమయ్యాక ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండాయని ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు మంగళవారం స్థానిక సర్‌సిఆర్‌రెడ్డి ఫార్మాస్యుటికల్ సైన్సెస్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మేయర్ ప్రసంగించారు. మహిళా సాధికారత సాధ్యం కావాలంటే మహిళలందరికీ చదువు ముఖ్యమన్నారు. భవిష్యత్ నిర్ణయాలను మహిళలే నిర్ణయించుకునే విధంగా ఉండాలని మేయర్ అన్నారు. మహిళా చట్టాలు, హక్కులు కాలరాసే వారిని నిలదీసే ధైర్యం మహిళలకు రావాలన్నారు. సిఎం జగన్ విద్య కోసం మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మేయర్‌ను కళాశాల మేనేజ్‌మెంట్ సన్మానించింది. తొలుత కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు అన్నపనేని భారతి రవి, గూడూరి ఆదిలక్ష్మి ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ ఎం.రాజా రామ్మోహన్‌రావు, కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

చింతలపూడి : మహిళల అభివృద్ధే దేశ ప్రగతికి కొలమానం అని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పూరేటి శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు, దామోదర్, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి : ఆరుగొలనుపేట ఎంపియుపి స్కూల్లో మహిళా దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు వి.రాధామాధవి, జి.శ్రీలక్ష్మి, కె.స్వర్ణ కుమారి, బి.మౌనికను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. మహిళా ఉపాధ్యాయులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.నాగరాజు, ఉపాధ్యాయులు డి.విప్లవ కుమార్, టి.రామారావు, డి.వెంకట్రామయ్య, వి.పెద్ద రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసునూరు : ప్రతి మహిళ ఆదర్శవంతంగా ఎదగాలని ముసునూరు జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ ఉపాధ్యాయులు రత్నమాల, మున్నీరుబేగం, శైలజ, కృష్ణవేణి, సీతాదేవిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగారావు, బి.సుకుమార్, యువరాజు, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : సమాజంలో మహిళల పాత్ర అమోఘమైందని, మహిళల పట్ల ప్రతిఒక్కరూ గౌరవభావంతో ఉండాలని ఆనంద మహిళామండలి అధ్యక్షురాలు సంధ్యారాణి అన్నారు. మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆనంద మహిళా మండలి, శ్రీభాగ్యలక్ష్మీ ఇండేన్ గ్యాస్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలోస్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కె.వాణి, ఎంపిపి జి.అనూష, గ్రామ సర్పంచి లక్ష్మీ విక్టర్‌బాబు, పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు.

చదువుతోనే రాణించగలం

ప్రజాశక్తి - చింతలపూడి

చదువుతోనే సమాజంలో రాణించగలమని తెలంగాణ రాష్ట్ర రాజ్యసభ సభ్యులు, ప్రముఖ హెట్రో సంస్థ అధినేత బండి పార్థసారిధి అన్నారు. రాజ్యసభకు ఎంపికైన సందర్భంగా ఆయనను చింతలపూడి పట్టణంలో ఆర్‌ఆర్ ఫంక్షన్ హాలులో అభినందించారు. ఈ కార్యక్రమానికి ఏపి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరావు, మాజీమంత్రి ఆళ్ల నాని, ఎంపీలు మిధున్ రెడ్డి, కోటగిరి శ్రీధర్, ఎంఎల్ఏ ఉన్నమట్ల ఎలిజ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంతమండలం చింతలపూడి అని, ఇక్కడ యువతకు పది వేల మందికి ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. రాజకీయాలకు అతీతంగా అనేక సేకా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందికిపైగా ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అభ్యర్థులు కవురు శ్రీనివాసరావు, వంకా రవీంద్రనాథ్, మోహన్ రెడ్డి, జానారెడ్డి, శ్రీహరిరెడ్డి, రమేష్ రెడ్డి, శరత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మా కుమారుడి మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

తమ కుమారుడి మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏలూరు మండలం కొక్కిరాయిలంక గ్రామస్తులు ఉచ్చుల మహంకాళి, రూతమ్మ దంపతులు ఏలూరు తహశీల్దార్ సోమశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మహంకాళి దంపతులు మాట్లాడుతూ గతనెల 28వ తేదీ సాయంత్రం తమ కుమారుడు విజయభాస్కర్‌ను స్నేహితులు సాయి, వాసు, శ్రీకాంత్ పుట్టినరోజు పార్టీ ఉంది అని చెప్పి ఇంటి నుంచి తీసుకువెళ్లారని, ఆ రోజు అర్ధరాత్రి అయినా తమ కుమారుడు ఇంటికి రాలేదని, తెల్లవారుజామున తమ కుమారుడు మొండికోడు వంతెన వద్ద శవంగా కనిపించాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము వెళ్లి చూసేసరికి అప్పటికే పోలీసులు అక్కడికి చేరుకున్నారని, హత్య జరిగిన ప్రదేశంలో పంచనామా నిర్వహించకుండా హడావుడిగా మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారని వివరించారు. మృతదేహంపై బలమైన గాయాలు ఉన్నందున అది హత్యగా తాము భావిస్తున్నామని, కానీ మార్చి ఒకటో తేదీన మృతదేహాన్ని తమకు అప్పగించిన పోలీసులు సరైన విచారణ చేయకుండా హత్యను రోడ్డు ప్రమాదంగా మలిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ విషయంపై స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం కచ్చితంగా కేసు నమోదు చేసి దోషులను శిక్షించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బొమ్మిడిలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి

ఉంగుటూరు: బొమ్మిడి గ్రామంలో టిడిపి నేతలు మంగళవారం ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. టిడిపి ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఫ్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు విజయకుమార్, రవిశంకర్, నల్ల ఆనంద్, మారిశెట్టి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌టి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి సృజన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



పోలవరం నియోజకవర్గ వైసిపి మహిళా నాయకురాలు దువ్వుల సృజనకు ఐదు జిల్లాల ఎస్‌టి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి పదవి దక్కింద. 2019 ఎన్నికల సమయంలో వైసిపిలో చేరిన ఆమె పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ప్రధానంగా ఆమె కరోనా సమయంలో పలు గ్రామాల్లోని ప్రజలకు కూరగాయలు, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు పంపిణీ చేశారు. పారిశుధ్య సిబ్బందికి, పోలీసులకు, జర్నలిస్టులకు నిత్యావసర వస్తువులు అందించారు. ముఖ్యంగా ఎన్నో ఏళ్లగా కుక్కునూరు మండలం వింజరం గ్రామపంచాయతీలో తాగునీటి సమస్య ఉండటంతో సంబంధిత విద్యుత్ అధికారులను కలిసి మాట్లాడి సమస్యను పరిష్కరించారు. అంతేకాకుండా ఐటిడిఎ పరిధిలో కారుణ్య నియామకంలో బుట్టాయగూడెం మండలంలోని వెలుతురువారిగూడెం గ్రామానికి చెందిన ఒక ఉద్యోగానికి సంబంధించిన ఫైలు సంవత్సరం పాటు పెండింగ్‌లో ఉండగా ఆ ఉద్యోగానికి సంబంధించిన వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ఉద్యోగ కల్పనకు కృషి చేశారు. ఐటిడిఎలో పిఆర్‌టి జాబ్స్ రెన్యువల్ విషయంలో కూడా సృజన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సేవలకు గుర్తింపుగా వైసిపి అనుబంధ విభాగంలో కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల ఎస్‌టి సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా నియమించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పదవి ఇచ్చిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా మహిళా దినోత్సవం రోజున తనకు ఈ పదవి దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

దళితుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

దళితుల అభ్యున్నతికి భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను, చట్టపరమైన బాధ్యతను ఆంధ్రప్రదేశ్ ఎస్‌సి కమిషన్ తీసుకుని పటిష్టంగా అమలు చేస్తుందని ఎపి ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లం ఆనంద ప్రకాష్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ప్రముఖ విద్యావేత్త డాక్టర్ అలుగు ఆనంద శేఖర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెల్లం ఆనంద్ ప్రకాష్ ప్రసంగిస్తూ అంబేద్కర్ జీవితాన్ని అర్పించి సాధించిన రాజ్యాంగ ఫలాలు ఈ దేశంలో ఉన్న దళితులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద, ఎస్సి కమిషన్ల మీద ఆధారపడి ఉందన్నారు. అంబేద్కర్ ఆశించిన సమసమాజ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హితోదికంగా కషి చేస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకుని మనందరం అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో దళితుల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు వెంప ఐజాక్, నల్లూరి దీపక్, పీతల కృష్ణ, సత్యానంద్ పాల్గొన్నారు.

మలుపుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు రోడ్డు విస్తరణకు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మంగళవారం చర్యలు చేపట్టారు. నూజివీడు నుండి ఏలూరు వెళ్లే ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారిలో నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లి, ముసునూరు మండలం సింహాద్రిపురం వద్ద ప్రమాదకరమైన మలుపులు ఉండటంతో ఆయా ప్రాంతాల్లో రోడ్డు విస్తరణకు స్థలం సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు తహశీల్దార్ ఎల్లారావు, ముసునూరు తహశీల్దార్ దాసరి సుధా, ఆర్‌అండ్‌బి డిఇ బాబూరావు, ఎఇ అశోక్ బాబు, మండల సర్వేయర్ రవీంద్రనాథ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

విద్యార్థులు చదువులో పోటీతత్వం అలవార్చుకోవాలని సిఐ బి.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం బర్రింకలపాడులోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే చదువులో రాణించాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ జి.రామానాయుడు మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో మల్లం సింహాచలంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డివిడిఎస్.రెడ్డి, రమేష్, జయకర్ జాన్సన్, మూర్తి సమత, సునీత పాల్గొన్నారు.

పలువురు జనసేనలో చేరిక

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో ముప్పర్తిపాడులో టిడిపి, వైసిపిలకు చెందిన 35 మంది మంగళవారం జనసేన పార్టీలో చేరినట్లు ఆ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి పార్టీలో చేరినట్లు చెప్పారు. 2024లో జనసేన విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వంగా రఘు, చింతలపాటి బాసిరాజు, తోట పవన్, తానేటి జోగేశ్వరరావునాయుడు, ప్రభాకర్‌రావు, కొమ్మోజి వెంకట్, ఆర్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.